# సాక్షి రంగారెడ్డి

సోమవారం, 3, ఏప్రిల్, 2023




**నేటి నుంచి బ్రహ్మోత్సవాలు**

కడ్తాల్ విజయ గణపతి, సరస్వతీ సహిత సీతారామచంద్రస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు సోమవారం నుంచి ప్రారంభం అవుతాయి. 8లో▸



**ప్రతి ఇంటికీ సంక్షేమ ఫలాలు**

ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలోని ప్రతి ఇంటికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందాయని ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. 8లో▸

**హాస్పిటల్ మేనేజ్‌మెంట్ కోర్సుల్లో ప్రవేశాలు**

ఉస్మానియా యూనివర్సిటీ: హాస్పిటల్ మేనేజ్‌మెంట్ ఏడాది కోర్సుల్లో ప్రవేశానికి 6న నోటిఫికేషన్ విడుదల చేయనున్నారు. ఓయూ పరిధిలోని దక్కన్ స్కూల్ ఆఫ్ హాస్పిటల్ మేనేజ్‌మెంట్, అపోలో కాలేజీ ఆఫ్ హాస్పిటల్ మేనేజ్‌మెంట్ కాలేజీల్లో ప్రవేశాలకు ఈ నెల 7 నుంచి దరఖాస్తులను స్వీకరించనున్నట్లు ఆదివారం పీజీ అడ్మిషన్స్ డైరెక్టర్ ప్రొ.పాండురంగారెడ్డి తెలిపారు.




## న్యూస్‌రీల్

### విజయోస్తు..

సాక్షి, సిటీబ్యూరో: పదో తరగతి పరీక్షలు నేటి నుంచి ప్రారంభం కానున్నాయి. నిర్దేశిత సమయానికి కంటే అర గంట ముందే పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలి. ఉదయం 9 గంటల నుంచి కేంద్రంలోకి అనుమతిస్తారు. పరీక్ష ప్రారంభానికి కనీసం 15 నిమిషాల ముందు గదిలో తమకు కేటాయించిన స్థానంలో కూర్చోవాల్సి ఉంటుంది. 9.30 గంటల తర్వాత చేరుకున్న అభ్యర్థులను పరీక్ష హాల్లోకి అనుమతించరు. పరీక్ష కేంద్రానికి సెల్ ఫోన్, ఎలక్ట్రానిక్ గాడ్జెట్‌లు తీసుకొస్తే స్వాధీనం చేసుకుంటారు.

### ఆత్మీయ సమ్మేళనాలు కాదు ఆత్మపరిశీలన చేసుకోండి

డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి



సమావేశంలో అభివాదం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

బడంగ్‌పేట్: ప్రజలకు ఏంచేశారని ఆత్మీయ సమ్మేళనాలు చేసుకుంటున్నారో ఆత్మ పరిశీలన చేసుకోవాలని డీసీసీ అధ్యక్షుడు చల్ల నర్సింహారెడ్డి ఎద్దేవా చేశారు. బడంగ్‌పేటలోని తిరుమల గార్డెన్‌లో ఆదివారం పార్టీ కార్పొరేషన్ అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి అధ్యక్షతన ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాబోయే ఎన్నికల్లో అటు కేంద్రంలో, ఇటు రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. కార్యకర్తలు ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలన్నారు. అధిష్టానం ఎవరికి టికెట్ ఇచ్చినా అంతా కలిసి ఏకతాటిపై ఉండి గెలిపించుకుంటామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో టీపీసీసీ కార్యదర్శి, మేయర్ చిగురింత పారిజాత, టీపీసీసీ సభ్యుడు దేప భాస్కర్‌రెడ్డి, జెడ్పీటీసీల ఫోరం మాజీ అధ్యక్షుడు ఏనుగు జంగారెడ్డి, పీసీసీ మాజీ కార్యదర్శి వంగేటి ప్రభాకర్‌రెడ్డి, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు బోయపల్లి రాఘవేందర్‌రెడ్డి, మహిళా అధ్యక్షురాలు అమృత, పలువురు కార్పొరేటర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### కొనసాగుతున్న బాలాజీ బ్రహ్మోత్సవాలు



గోప వాహనంపై స్వామివారు

మొయినాబాద్: చిలుకూరు బాలాజీ బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం స్వామివారు గోప వాహన, హనుమంత వాహన సేవలు అందుకున్నారు. మొదటగా గోపవాహనంపై ఆసీనులను చేసి ఆలయ పురవీధుల్లో ఊరేగించారు. అనంతరం హనుమంత వాహనంపై స్వామివారి ఊరేగింపును అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేదపారాయణం, పూజలు, మంగళహారతి సేవలు అందించారు. వేడుకల్లో ఆలయ మేనేజింగ్ కమిటీ కన్వీనర్ గోపాల కృష్ణస్వామి, అర్చకులు రంగరాజన్, నరసింహన్, మురళి, కన్నయ్య, కిట్టుస్వామి, సురేష్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

**నేడు స్వామివారి కల్యాణోత్సవం..**

బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం స్వామివారిని సూర్యప్రభ వాహనం, గరుడ వాహనంపై ఊరేగిస్తారు. రాత్రి 11 గంటలకు స్వామివారి కల్యాణోత్సవాన్ని ఆలయ ప్రాంగణంలో నిర్వహిస్తారు.

# ఇదేనా 'ఉపకారం'!

**అందని ప్రీమెట్రిక్.. పోస్ట్ మెట్రిక్ స్కాలర్‌షిప్‌లు**

- కాలేజీల్లో పేరుకుపోయిన దరఖాస్తులు
- ముగుస్తున్న ఇంటర్ పరీక్షలు
- ఇప్పటికీ అందని ఉపకార వేతనాలు
- ఆందోళనలో విద్యార్థులు




సాక్షి, రంగారెడ్డిజిల్లా: ఉపకార వేతనాలు అందక విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారు. ఆన్‌లైన్ వేదికగా ఆయా సంక్షేమ శాఖలకు పేద, మధ్య తరగతికి చెందిన వేలాది మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారు. ఆన్‌లైన్‌లో అందిన దరఖాస్తుతో పాటు అటెండెన్స్, అడ్మిషన్, ఆదాయ, కులధ్రువీకరణ పత్రాలకు సంబంధించిన హార్డ్‌కాపీలను కాలేజీ ప్రిన్సిపాళ్లు ఆయా సంక్షేమశాఖలకు పంపి, సకాలంలో విద్యార్థుల ఖాతాల్లో డబ్బులు జమయ్యేలా చూడాల్సి ఉంది. కానీ జిల్లాలోని పలు ప్రభుత్వ, ప్రైవేటు కాలేజీల ప్రిన్సిపాల్స్ ఈ విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ఇంటర్మీడియెట్ వార్షిక పరీక్షలు ముగుస్తున్నా ఇప్పటి వరకు వారి అకౌంట్లలో డబ్బులు జమ కాకపోవడంతో విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు.

**నాలుగు వేలకుపైగా దరఖాస్తులు**

దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులకు ప్రభుత్వం ఏటా ఉపకార వేతనాలు మంజూరు చేస్తున్న విషయం తెలిసిందే. ఎంపిక చేసుకున్న కోర్సును, తరగతిని బట్టి ఈ ఉపకార వేతనాలను అందిస్తోంది. జిల్లాలో 2022–23 విద్యా సంవత్సరానికి షెడ్యూల్డ్ కులాల సంక్షేమాభివృద్ధి శాఖకు 26,325 మంది విద్యార్థులు ఆన్‌లైన్ వేదికగా దరఖాస్తు చేసుకున్నారు. వీరి కోసం ప్రభుత్వం రూ.20.64 కోట్లు మంజూరు చేసింది. వీరిలో ఇప్పటి వరకు 13,806 మందికి సంబంధించిన దరఖాస్తులు క్లియర్ అయ్యాయి. ఆయా విద్యార్థుల ఖాతాల్లో స్కాలర్‌షిప్ డబ్బులు కూడా జమయ్యాయి. 896 దరఖాస్తులు విద్యార్థుల వద్దే ఉండిపోగా, 4,246 దరఖాస్తులు కాలేజీ యాజమాన్యాల వద్ద పెండింగ్‌లో ఉన్నాయి. దరఖాస్తులకు ఆధార్ అనుసంధానం చేయకపోవడంతో మరో 2,786 పెండింగ్‌లో ఉండగా, 73 తిరస్కరణకు గురయ్యాయి. కాలేజీల వద్ద పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులకు విద్యార్థుల హాజరు, అడ్మిషన్ ధ్రువపత్రాలను జత చేసి సంక్షేమశాఖ అధికారులకు అందజేయాల్సి ఉంది. విద్యా సంవత్సరం ముగుస్తున్నా ఇప్పటికీ ఆయా విద్యార్థులకు సంబంధించిన హార్డ్ కాపీలను పంపకపోవడంతో ఉపకారవేతనాలకు అర్హత ఉన్న దరఖాస్తుదారులంతా నష్టపోవాల్సి వస్తోంది. ఇలా కేవలం షెడ్యూల్డ్ కులాల సంక్షేమాభివృద్ధిశాఖలోనే కాదు గిరిజన సంక్షేమశాఖ, బీసీ సంక్షేమశాఖల్లోనూ ఇదే పరిస్థితి నెలకొంది.

**"వివరాలు పంపడం లేదు..**

ఇప్పటి వరకు 13,806 మందికి రూ.18.23 కోట్ల ఉపకార వేతనాలు చెల్లించాం. సంక్షేమశాఖ వద్ద మరో రూ.2.40 కోట్ల వరకు నిల్వ ఉన్నాయి. ప్రభుత్వ కాలేజీలకు సంబంధించిన ప్రిన్సిపాల్స్ విద్యార్థులు అందజేసిన దరఖాస్తులు, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలకు సంబంధించిన హార్డ్‌కాపీలు, హాజరు, అడ్మిషన్‌కు సంబంధించిన పత్రాలను సంక్షేమశాఖకు పంపడం లేదు. సాధ్యమైనంత త్వరగా వివరాలు పంపించి విద్యార్థులను ఆదుకోవాల్సిన బాధ్యత వారిదే.

– రామారావు, డిప్యూటీ డైరెక్టర్, షెడ్యూల్డ్ కులాల సంక్షేమాభివృద్ధిశాఖ అధికారి

# ఫుల్ కిక్కు

- మద్యం విక్రయాలతో ప్రభుత్వానికి భారీగా ఆదాయం
- రాష్ట్ర వ్యాప్తంగా రూ.35,000 కోట్ల రాబడి
- గ్రేటర్ జిల్లాల నుంచే రూ.13,518.87 కోట్లు
- అత్యధికం రంగారెడ్డి జిల్లా నుంచే..



సాక్షి, రంగారెడ్డిజిల్లా: మద్యం విక్రయాలు ప్రభుత్వానికి కాసుల వర్షం కురిపించాయి. గత ఆర్థిక సంవత్సరం (ఏప్రిల్ 2022 నుంచి మార్చి 2023 వరకు) గ్రేటర్ జిల్లాల నుంచి రూ.13,518.87 కోట్ల ఆదాయం సమకూరడం విశేషం. రాష్ట్రవ్యాప్తంగా రూ.35 వేల కోట్ల ఆదాయం వస్తే.. ఈ మూడు జిల్లాల నుంచే 42–45 శాతం రావడం గమనార్హం. మద్యం అమ్మకాల్లో రూ.8436.14 కోట్లతో రంగారెడ్డి జిల్లా మొదటి స్థానంలో నిలవగా.. రూ.3,752. 96 కోట్ల ఆదాయంతో హైదరాబాద్ రెండో స్థానంలో నిలిచింది. రూ.1,329.78 కోట్లతో మేడ్చల్ జిల్లా మూడో స్థానంలో నిలిచింది.

**ఇక్కడే ఎక్కువ ఎందుకంటే?**

ఐటీ అనుబంధ సంస్థలు ఇక్కడ అధికం. ఉద్యోగుల నెలసరి వేతనాలు రూ.లక్షల్లో ఉన్నాయి. జాతీయ, అంతర్జాతీయ కంపెనీల రాకతో శివారు జిల్లాల్లోని భూముల ధరలకు ఒక్కసారిగా రెక్కలొచ్చాయి. రియల్ ఎస్టేట్ వ్యాపారం ఊపందుకుంది. మార్కెటింగ్ ఎజెంట్ల ఆదాయం భారీగా ఉంటుంది. శుభ కార్యాల్లోనే కాదు వీకెండ్ పేరుతో విందులు, వినోదాల్లో మద్యం తప్పనిసరైంది. లిక్కర్ అమ్మకాలు ఒక్కసారిగా పెరిగాయి. ఖరీదైన మద్యం అమ్మకాలు కూడా ఇక్కడే అధికం.

**గ్రేటర్‌లో మద్యం అమ్మకాలు (రూ.కోట్లలో..)**

| నెల | హైదరాబాద్ | రంగారెడ్డి | మేడ్చల్ |
|---|---|---|---|
| ఏప్రిల్ | 260.62 | 629.02 | 100.55 |
| మే | 307.41 | 704.64 | 114.82 |
| జూన్ | 298.61 | 685.47 | 107.31 |
| జూలై | 359.82 | 741.89 | 119.07 |
| ఆగస్టు | 323.72 | 726.33 | 117.44 |
| సెప్టెంబర్ | 299.04 | 671.79 | 102.32 |
| అక్టోబర్ | 345.04 | 731.77 | 119.28 |
| నవంబర్ | 277.05 | 579.79 | 84.53 |
| డిసెంబర్ | 382.28 | 881.21 | 140.89 |
| జనవరి | 287.23 | 666.86 | 103.81 |
| ఫిబ్రవరి | 310.59 | 710.75 | 111.47 |
| మార్చి | 300.75 | 706.62 | 108.29 |

# కేసీఆర్‌తోనే సుపరిపాలన




ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న మంత్రి సబితారెడ్డి

**మంత్రి సబితారెడ్డి**

బడంగ్‌పేట్: తెగించి కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణను ముఖ్యమంత్రి కేసీఆర్ పాలిస్తేనే ప్రజలందరికీ శ్రీరామరక్షగా ఉంటుందని.. ఏ పార్టీకి అప్పగించినా కుక్కలు చింపిన విస్తరిలా మారుతుందని విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి పేర్కొన్నారు. కార్పొరేషన్ పరిధిలోని అల్మాస్‌గూడలో ఆదివారం బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. హనుమాన్ దేవాలయం నుంచి భారీ ర్యాలీ తీశారు. చప్పిడి అడివిరెడ్డి గార్డెన్‌లో ఎంపీటీసీ మాజీ సభ్యుడు సంరెడ్డి వెంకట్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సమ్మేళనంలో మంత్రి మాట్లాడారు. సామాన్య ప్రజలకు మరింత చేరువై, వారి సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకోవచ్చని ముఖ్యమంత్రి కేసీఆర్ ఆత్మీయ సమ్మేళనాలకు అంకురార్పణ చేశారని గుర్తు చేశారు. నియోజకవర్గాన్ని మోడ్రన్‌గా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పని చేస్తున్నట్లు చెప్పారు. పెద్ద ఎత్తున నిధులు మంజూరు చేస్తున్న సీఎంకు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ శ్రీధర్, పార్టీ కార్పొరేషన్ అధ్యక్షుడు రామిడి రాంరెడ్డి, పలువురు కార్పొరేటర్లు, మహిళా నాయకులు, కాలనీ సంక్షేమ సంఘాల ప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# కేంద్ర పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి



కార్పొరేటర్లు, మహిళా నాయకులతో సమావేశమైన తమరై సెల్వి

**బీజేపీ మహిళా మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యురాలు తమరై సెల్వి**

మీర్‌పేట: కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని బీజేపీ మహిళా మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యురాలు తమరై సెల్వి కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ప్రవాస్ యోజన కార్యక్రమంలో భాగంగా ఆదివారం మీర్‌పేట కార్పొరేషన్ 27వ డివిజన్ సిర్లాహిల్స్ కాలనీలో పర్యటించిన ఆమె బీజేపీ కార్పొరేటర్లు, మహిళా నాయకులతో కలిసి పార్టీ కార్యక్రమాలు, పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రానున్న ఎన్నికల్లో తెలంగాణలో గెలుపే లక్ష్యంగా కలసికట్టుగా పనిచేయాలని అన్నారు. అనంతరం కేంద్ర ప్రభుత్వ పథకాల గురించి ఆమె వివరించారు. జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు సుజాతగౌడ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పార్టీ మీర్‌పేట అధ్యక్షుడు పెండ్యాల నర్సింహ, కార్పొరేటర్లు పసునూరి భిక్షపతిచారి, కీసర గోవర్ధన్‌రెడ్డి, ఏ.భీంరాజ్, కీసర హరినాథ్‌రెడ్డి, నాయకులు సోమేశ్వర్, నర్సింహయాదవ్, సూల ప్రభాకర్, గోలి శ్రీనివాస్‌రెడ్డి, సత్తయ్య, శివకుమార్‌చారి, రజని, ఇంద్రమ్మ, లక్ష్మి, సుమిత్ర, ఆదిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# భలే చాన్స్‌లే..!

- తిరస్కరణ నివాస స్థలాలకు మళ్లీ క్రమబద్ధీకరణ
- దరఖాస్తులపై రెండు పర్యాయాలు అనర్హత వేటు
- తాజాగా గడువు పొడిగింపుతో పెండింగ్ సైతం వెనక్కి
- మీ సేవ కేంద్రాల్లో దరఖాస్తుల నమోదు ప్రక్రియ మరూ
- గ్రేటర్‌లో లక్షకుపైగా దరఖాస్తులు రావచ్చని అంచనా



సాక్షి, సిటీబ్యూరో: ఏళ్ల తరబడి ప్రభుత్వ స్థలాల్లో నివాసాలు ఏర్పాటు చేసుకున్న పేద కుటుంబాలు ఇళ్ల స్థలాల క్రమబద్ధీకరణ అవకాశాన్ని సద్వినియోగం చేసుకునే పనిలో పడ్డారు. ప్రభుత్వం ఇప్పటికే రెండు పర్యాయాలు అవకాశం కల్పించినా.. సరైన ఆధారాలు లేక దరఖాస్తులు చేసుకోలేకపోయిన, దరఖాస్తు చేసుకున్నప్పటికీ తిరస్కారానికి గురైన నివాసాలకు మరోసారి క్రమబద్ధీకరణకు వెసులుబాటు లభించింది. మరోవైపు రెండుసార్లు అవకాశం లభించినా ఆక్రమణ గడువు కాలంలో మార్పు లేకపోవడంతో చాలా నివాసాలకు అవకాశం దక్కలేదు. తాజాగా కాల పరిమితి పొడిగించడం పేదలకు కలిసి వచ్చింది. మీ సేవ కేంద్రాల్లో రెండురోజుల క్రితం దరఖాస్తుల నమోదు ప్రక్రియ ప్రారంభమైంది.

**మళ్లీ పరిశీలన..**

గతంలో తిరస్కరణకు గురైన దరఖాస్తులను సైతం మళ్లీ పరిశీలనకు వెసులుబాటు లభించింది. తాజాగా గడువు పొడిగించడంతో జీఓ 58, 59 కింద చేసుకున్న కొన్ని దరఖాస్తులు సక్రమంగా లేకపోవడంతో తిరిగి సమగ్ర ఆధారాలతో దరఖాస్తు చేసుకునేందుకు తిరస్కరించారు. వాస్తవంగా గతేడాది జీఓ 58, 59లకు అనుగుణంగా జారీ చేసిన జీఓ 14 కింద హైదరాబాద్– రంగారెడ్డి– మేడ్చల్ జిల్లాలో సుమారు 1.14 లక్షల కుటుంబాలు దరఖాస్తు చేసుకున్నాయి. వాటిపై క్షేత్ర స్థాయి పరిశీలన పూర్తయి 54 వేల దరఖాస్తులు అర్హత సాధించగా, మిగిలిన దరఖాస్తులు తిరస్కరించారు. క్రమబద్ధీకరణ ప్రక్రియ మాత్రం తుదిదశకు చేరుకోకముందే మరో జీఓతో కాల పరిమితితో పాటు గడువు పొడిగించారు. దీంతో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను సైతం వెనక్కి పంపించారు. ఫలితంగా పెండింగ్, తిరస్కరణకు గురైన నివాస స్థలాలకు సైతం మరోసారి అవకాశం దక్కినట్లయింది.

**హైదరాబాద్ జిల్లా ఇలా..**

- ఇటీవల హైదరాబాద్ జిల్లా మొత్తం మీద 963 దరఖాస్తులను తిరస్కరించినట్లు అధికార వర్గాలు పేర్కొన్నాయి. జీఓ 58 కింద 497, 59 కింద 195, జీఓ 58 నుంచి 59 కింద మార్పు చెందిన 271 దరఖాస్తులను అధికారులు తిరస్కరించారు. అత్యధికంగా ఖైరతాబాద్ మండలంలో 760 దరఖాస్తులు. షేక్‌పేటలో 158 దరఖాస్తులు తిరస్కణకు గురయ్యాయి. హైదరాబాద్ జిల్లా రెవెన్యూ పరిధిలో కేవలం జీఓ 58 కింది కేవలం 215 దరఖాస్తులు మాత్రమే ఆమోదించి పట్టాల పంపిణీకి సిఫారసు చేశారు.
- జీఓ 59 కింద మొత్తం దరఖాస్తులకు 752 మాత్రమే డిమాండ్ నోటీసులు జారీ చేశారు. వీటి ద్వారా రూ.79.95 కోట్ల ఆదాయ రావచ్చని అధికార యంత్రాంగం అంచనా వేసింది. కానీ 86 కుటుంబాలు మాత్రమే రూ.4.15 కోట్లు చెల్లించాయి. అందులో 59 కుటుంబాలు పూర్తి రుసుం చెల్లించగా, రెండు నివాస స్థలాలకు కన్వేయన్స్‌డ్ డీడ్ (సీడీ) జారీ కాగా, మిగిలిన 57 నివాసాలకు సీడీ జారీ కావాల్సి ఉంది. మొత్తం మీద 666 దరఖాస్తుదారులు రూ.75.81 కోట్లు చెల్లించాల్సి ఉంది.

**మేడ్చల్– మల్కాజిగిరిలో..**

మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో జీఓ 58 కింద 32,258 దరఖాస్తులు, 59 కింద 28,280 నివాస స్థలాల కటుంబాలు దరఖాస్తు చేసుకున్నాయి. అందులో క్షేత్ర స్థాయి పరిశీలన అనంతరం సుమారు 80 శాతం దరఖాస్తులు తిరస్కరణకు గురయ్యాయి. మొత్తం మీద 15 వేల దరఖాస్తులను ఆమోదించారు. జీఓ కింద 58 కింద పట్టాలు జారీకి రంగం సిద్ధం కాగా, మరోవైపు 59 జీఓ కింద డిమాండ్ నోటీసులు జారీ అయ్యాయి. తుది పక్రియ పూర్తి కాకముందే గడువు మరో మారు పొడిగించారు.

# ఆటిజం బాధితులను ఆదరించాలి

**బ్యాడ్మింటన్ కోచ్ పుల్లెల గోపీచంద్**

మణికొండ: ఆటిజం బాధితులను ఆదరించి, ఆప్యాయతను పంచాల్సిన అవసరం ఉందని బ్యాడ్మింటన్ కోచ్ పుల్లెల గోపీచంద్ అన్నారు. ఆదివారం నగర శివారు గండిపేట పరిధి ఖానాపూర్‌లోని ఓరో స్పోర్ట్స్ విలేజీలో ప్రపంచ ఆటిజం డే సందర్భంగా మార్‌హం రెసినెగింగ్ రిసిలెన్స్ ఎన్‌జీఓ సంస్థ నిర్వహించిన 2కే వాక్‌ను ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా రేడియో మిర్చీ టీమ్ ఆర్‌జే షాదాబ్, ఆర్‌జే శెజ్జి, రూపాల్‌లు సందడి చేశారు. వెయ్యి మందికి పైగా తరలివచ్చిన వారితో వామప్ చేయించి 2కే వాక్‌ను ప్రారంభించారు. అనంతరం చిన్నారులు నిర్వహించిన ఫ్లాష్‌మాబ్ అందరినీ అలరించింది. కార్యక్రమంలో ఎన్‌జీఓ సంస్థ వ్యవస్థాపకురాలు డాక్టర్ నబాత్ లఖాని, ఆసియా పసిఫిక్ యూనివర్స్ అభిమానిక యాదవ్, రెయిన్‌బో ఆస్పత్రి డైరెక్టర్ డాక్టర్ దినేష్ తదితరులు పాల్గొన్నారు.

# వివక్షను రూపుమాపుదాం

**అంతర్జాతీయ మానవ హక్కుల కన్వీనర్ ఫాల్ దివాకర్**



మాట్లాడుతున్న ఫాల్ దివాకర్

తలకొండపల్లి: ప్రపంచవ్యాప్తంగా వివక్ష కొనసాగుతోందని.. దీనిని రూపుమాపడం కోసం పోరాటం చేయాలని అంతర్జాతీయ మానవ హక్కుల కన్వీనర్ ఫాల్ దివాకర్ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని పంచాయతీ కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కుల, వర్ణ వివక్ష ప్రపంచంలోని అనేక దేశాల్లో కొనసాగుతోందని అన్నారు. లాటిన్ అమెరికా, నేపాల్, బ్రెజిల్, జపాన్, సౌతాఫ్రికా తదితర దేశాల్లో సైతం వివక్షకు గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇండియాలో దళితులు అంటరానితనంతో పాటు, కుల వివక్ష, అణచివేతలకు గురవుతున్నా ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదని విమర్శించారు. 40 ఏళ్లుగా ఇండియాతో పాటు, అనేక దేశాల్లో వివక్షకు గురవుతున్న ప్రజల కోసం ఒక వేదిక ఏర్పాటు చేసి వారి హక్కుల కోసం పోరాడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అంతర్జాతీయ మానవ హక్కుల వేదిక ప్రధాన కార్యదర్శి బీనా మీర్, దళిత బహుజన శ్రామిక యూనియన్ జిల్లా కార్యదర్శి జోగు రమేష్, రాష్ట్ర అధ్యక్షుడు ఆనంద్, కార్యదర్శి నరసింహ, ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు చిట్టిబాబు, సర్పంచ్ లలిత, జ్యోతయ్య, డీబీఎస్‌యూ రాష్ట్ర కార్య దర్శి కొమ్ము తిరపతి, మాజీ ఎంపీపీ లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు.



# గెలుపే లక్ష్యంగా పని చేయండి



సమావేశానికి హాజరైన బీజేపీ నేతలు

**పార్టీ శ్రేణులకు బీజేపీ జాతీయ కార్యదర్శి అరవింద్ మీనన్ పిలుపు**

తుక్కుగూడ: వచ్చే ఎన్నికల్లో రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చే విధంగా ప్రతి కార్యకర్త కృషి చేయాలని ఆ పార్టీ జాతీయ కార్యదర్శి, తెలంగాణ సహ ఇన్‌చార్జి అరవింద్ మీనన్ అన్నారు. మున్సిపల్ కేంద్రంలో ఆదివారం రంగారెడ్డి రూరల్ జిల్లా బూత్ స్వశక్తికరణ్ సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన అరవింద్ మీనన్ మాట్లాడుతూ.. తెలంగాణలో ముఖ్యమంత్రి కేసీఆర్ అవినీతి పాలనను అంతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్రంలో పరిపాలన అధ్వానంగా ఉందని, 2014లో రాష్ట్రం ఏర్పడినప్పుడు మిగులు రాష్ట్రంగా ఉన్న తెలంగాణ అప్పులమయంగా మారిందన్నారు. ఎన్నికల సమయం సమీపిస్తున్నందున ప్రతి కార్యకర్త బూత్ స్థాయి నుంచి కష్టపడి పనిచేయాలన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి, మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, రాష్ట్ర నాయకులు ఆచారి, పాపయ్యగౌడ్, వీరేందర్‌గౌడ్, కొప్పు భాషా, బోసుపల్లి ప్రతాప్, అంజన్‌కుమార్, సుధాకర్‌శర్మ, పొరెడ్డి నర్సింహారెడ్డి, శ్రీవర్ధన్‌రెడ్డి, అందెల శ్రీరాములు యాదవ్, సుదర్శన్‌రెడ్డి, పొరెడ్డి అర్జున్‌రెడ్డి, అశోక్‌గౌడ్, ఆయా మండలాల, మున్సిపాలిటీ అధ్యక్షులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదంలో బాలిక మృతి

**ఆమనగల్లు:** పట్టణ సమీపంలోని పెద్ద బ్రిడ్జి వద్ద హైదరాబాద్ – శ్రీశైలం జాతీయ రహదారిపై ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో నాగర్‌కర్నూల్ జిల్లా వెల్దండ మండలం పెద్దాపూర్ పరిధిలోని తుంకిబండ తండాకు చెందిన ఐశ్వర్య(10) అనే బాలిక మృతిచెందింది. ఆమనగల్లు ఎస్‌ఐ సుందరయ్య కథనం మేరకు.. తుంకిబండ తండాకు చెందిన కిరణ్ తన సోదరుని కుమార్తె ఐశ్వర్యను తన ద్విచక్ర వాహనంపై కూరగాయలు తెచ్చేందుకు ఆమనగల్లు వస్తుండగా పెద్ద బ్రిడ్జి వద్ద బైక్ ఆగిపోయింది. కిరణ్ బండిని పరిశీలిస్తుండగా ఐశ్వర్య పక్కన నిల్చుంది. ఇదే సమయంలో కల్వకుర్తి నుంచి వేగంగా వచ్చిన కారు ఐశ్వర్యను ఢీ కొట్టింది. బాలికకు తీవ్ర గాయాలు కావడంతో ఆమనగల్లు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ తరలిస్తుండగా బాలిక మృతిచెందింది. మృతురాలి తల్లి సరోజ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ సుందరయ్య తెలిపారు.


బాలికకు ప్రథమ చికిత్స చేస్తున్న సిబ్బంది

# బైక్ అదుపుతప్పి యువకుడి మృతి

**మొయినాబాద్:** బైక్ అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న గోడను ఢీ కొట్టడంతో యువకుడు మృతి చెందాడు. ఈ సంఘటన మండలంలోని హైదరాబాద్ – బీజాపూర్ జాతీయ రహదారిపై శనివారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నగరంలోని టోలిచౌకి ప్రాంతానికి చెందిన ముబాషిర్(25) అతని స్నేహితుడితో కలసి శనివారం రాత్రి బైక్‌పై మొయినాబాద్‌కు వచ్చారు. తిరుగు ప్రయాణంలో రాణే ఇంజన్ వాల్వ్స్ కంపెనీ వద్దకు రాగానే బైక్ అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న గోడకు ఢీ కొట్టింది. దీంతో ఇద్దరికి గాయాలయ్యాయి. వారిని నగరంలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ముబాషిర్ పరిస్థితి విషమంగా ఉండడంతో ఉస్మానియాకు తరలించారు. అప్పటికే ముబాషిర్ మృతి చెందినట్లు ఆసుపత్రి వైద్యులు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

# ఈటలకు బీజేపీ నేతల స్వాగతం


ఈటల రాజేందర్‌తో బీజేపీ ఆమనగల్లు నాయకులు

**ఆమనగల్లు:** శ్రీశైలం దేవస్థానం వెళుతున్న ఎమ్మెల్యే ఈటల రాజేందర్‌కు ఆదివారం బీజేపీ పట్టణ నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యులు ఆచారి ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు ఈటలను కలసి ఘనంగా సత్కరించారు.

# నేటి నుంచి బ్రహ్మోత్సవాలు

- ముస్తాబైన సీతారామచంద్ర స్వామి ఆలయం
- మూడు రోజుల పాటు ఉత్సవాలు
- పెద్ద ఎత్తున తరలిరానున్న భక్తులు

**కడ్తాల్:** మండల కేంద్రంలోని విజయ గణపతి, సరస్వతీ సహిత సీతారామచంద్రస్వామి ఆలయ ప్రథమ వార్షిక బ్రహ్మోత్సవాలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ నెల 5వ తేదీ వరకు ఉత్సవాలు జరుగన్నాయి. విజయ గణపతి, సరస్వతి, శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి, సీతారామ లక్ష్మణ ఆంజనేయ స్వామి మహోత్సవాలు వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ సందర్భంగా ఆలయాన్ని సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. ఈ నెల 5న సీతారామ కల్యాణ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించనున్నారు. ఆలయంలో మూడు రోజుల పాటు నిర్వహించే కార్యక్రమాల్లో ప్రముఖులు, ఆధ్యాత్మిక గురువులు, మత గురువులు రానున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఉత్సవాల వివరాలను ఆలయ నిర్మాణ దాత పీ బస్వరాజ్, రాజమణి దంపతులు వివరించారు.

**స్వామివారికి నిర్వహించే ఉత్సవాలు**

3వ తేదీ సుప్రభాతం, నిత్యార్చనలు, గంగా సేకరణ, గో పూజ, ఆలయ ప్రవేశం, గణపతి విశ్వక్సేన ఆరాధన, పుణ్యాహ వచనం, నాంది సమారాధన, పంచగవ్య ప్రాశనం, రుత్వీగ్వరణం, రక్ష బంధనం, అఖండ దీపారాధన, ప్రవేశ బలి, యాగశాల ప్రవేశం, ధ్వజారోహణం, అంకురార్పణ, కలశ స్థాపన, అర్చన, అగ్ని ప్రతిష్ఠ, లక్ష్మీగణపతి హోమం, జలాధివాసం, గంగా హారతి, తీర్థ ప్రసాద వితరణ. 4వ తేదీ మంటప ఆరాధన, సుప్రభాతం, దేవతామూర్తులు, ఉత్సవమూర్తులకు మహాస్నపనం, సుదర్శన హోమం, ధాన్య దివాసం, మంగళ హారతి, మంత్ర పుష్పం, తీర్థ ప్రసాద వితరణ, వన పూజ, రుద్రహోమం, దేవీ హోమం, ఉత్సవమూర్తులకు ఘృతాధివాసం, య్యధివాసం. 5వ తేదీ సుప్రభాతం, నిత్యార్చనలు, విశేష ద్రవ్యములతో అభిషేకం, ఉత్సవ మూర్తులకు మంగళ స్నానాలు, సీతారామ స్వామి కల్యాణ మహోత్సవం తదితర కార్యక్రమాలు ఉంటాయని ఆలయ నిర్వాహకులు బస్వరాజ్ తెలిపారు. ఉత్సవాలకు వచ్చే భక్తులకు నిత్య అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నారు.


బ్రహ్మోత్సవాలకు ముస్తాబైన సీతారామాలయం


ఉత్సవమూర్తులు

# ప్రతి ఇంటికీ ప్రభుత్వ సంక్షేమ ఫలాలు

ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి

**ఇబ్రహీంపట్నం:** నియోజకవర్గంలోని ప్రతి ఇంటికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందాయని ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం ఉప్పరిగూడ కేఎంఆర్ ఫంక్షన్ హాల్‌లో బీఆర్‌ఎస్ మండల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. తాను అధికారాన్ని అడ్డుగా పెట్టుకొని దోచుకోలేదు, దాచుకోలేదు అంకితభావంతో మాత్రమే పని చేశానని అన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి, ప్రజా సంక్షేమానికి అహర్నిశలు కృషి చేశానని తెలిపారు. రూ. 2,930 కోట్లతో నియోజకవర్గంలో వివిధ అభివృద్ధి పనులు చేసినట్లు చెప్పారు. తన కుమారుడు ప్రశాంత్‌రెడ్డి నియోజకవర్గంలో 63 రోజుల పాటు నిర్వహించిన ప్రగతి నివేదన పాదయాత్ర ద్వారా తన హయాంలో చేసిన అభివృద్ధిని ప్రజలకు వివరించడం జరిగిందన్నారు. ఈ పాదయాత్రకు ప్రజలు బ్రహ్మరథం పట్టారని అన్నారు. ఈ పాదయాత్రలో తమ దృష్టికి వచ్చిన సమస్యల పరిష్కరిస్తామన్నారు. నియోజకవర్గంలోని 23 సింగిల్ రోడ్లను డబుల్‌గా మార్చామన్నారు. మిషన్ భగీరథతో మంచి నీటి సమస్య తీరిందని పేర్కొన్నారు. 24 గంటల విద్యుత్ సరఫరా జరుగుతోందని చెప్పారు. నియోజకవర్గంలోని కొంగరకలాన్‌కు కలెక్టరేట్ తెచ్చామని తెలిపారు. ఈ ప్రాంతంలో తొమ్మిదేళ్ల క్రితం ఎకరా భూమి రూ. 10 లక్షలు ఉంటే నేడు రూ. 2 కోట్లకు పైగా పెరిగిందన్నారు. దీంతో ప్రజల ఆర్థిక స్తోమత వృద్ధి చెందిందని తెలిపారు. ఈ ప్రాంతంలో పరిశ్రమలు నెలకొల్పడం ద్వారా యువత, మహిళలకు ఉపాధి లభించిందని చెప్పారు. మెడికల్ కళాశాల ఏర్పాటు చేయాలని సీఎం కేసీఆర్, మంత్రి హరీశ్‌రావును కోరినట్లు తెలిపారు. సొంత స్థలం ఉంటే ఇంటి నిర్మాణానికి రూ. 3 లక్షలు ఇవ్వనున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలోని దళితుల ఉపాధికి దళిత బంధు పథకం కింద రూ. 1100 కోట్లు ఖర్చు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు సీ రాములు, పార్టీ రాష్ట్ర నాయకులు కే మల్లేష్, ఎం ప్రశాంత్‌కుమార్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సీ వెంకటరమణారెడ్డి, ఎంపీపీ కృపేష్, మండల ఉపాధ్యక్షులు ఎం ప్రతాప్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ చంద్రయ్య, లారీ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు బీ నందారెడ్డి, రైతు బంధు జిల్లా అధ్యక్షుడు వీ లక్ష్మారెడ్డి, సర్పంచ్‌ల సంఘం జిల్లా అధ్యక్షులు బీ రాంరెడ్డి, నాయకులు ఎం సురేష్, భాస్కర్‌రెడ్డి, ఎం అంజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కిషన్‌రెడ్డి

**బాధితులకు అండగా ఉంటాం**

**మంచాల:** బడుగు, బలహీన వర్గాల ప్రజలకు అండగా నిలుస్తామని ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి అన్నారు. ఇటీవల అనారోగ్యానికి గురైన నిమ్స్‌లో చికిత్స పొందుతున్న మంచాల మండలం చెన్నారెడ్డిగూడకు చెందిన జీ భారతమ్మ కుటుంబ సభ్యులకు ఆదివారం ఎమ్మెల్యే రూ. 1.50 లక్షల విలువ చేసే ఎల్‌ఓసీ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నియోజక వర్గ ప్రజలకు నిత్యం అందుబాటు ఉంటు సేవ చేస్తున్నట్లు తెలిపారు. అన్ని గ్రామాలకు, తండాలను కలుపుతూ రోడ్డు రవాణా వ్యవస్థను ఏర్పాటు చేశామన్నారు. ప్రజలు వాస్తవాలను గమనించాలన్నారు. భవిష్యత్‌లో మరింత అభివృద్ధి దిశగా ముందుకు పోవడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం మార్కెట్ కమిటీ చైర్మన్ ఏ చంద్రయ్య, బీఆర్‌ఎస్ మండల ప్రధాన కార్యదర్శి బహదూర్, వార్డు సభ్యులు శంకర్ నాయక్, నాయకులు జగదీష్, రవి, మధు తదితరులు పాల్గొన్నారు.

# అంబేడ్కర్‌ను ఆదర్శంగా తీసుకోవాలి

- ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్
- సంగాయిపల్లిలో అంబేడ్కర్ విగ్రహావిష్కరణ


అంబేడ్కర్ విగ్రహావిష్కరణలో ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్, నాయకులు

**తలకొండపల్లి:** ప్రపంచ మేధావుల్లో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అగ్రగణ్యుడని ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ అన్నారు. పార్లమెంట్ భవనానికి రాజ్యాంగ నిర్మాత డాక్టర్ అంబేడ్కర్ పేరు పెట్టాలని ఆయన డిమాండ్ చేశారు. ఆదివారం రాత్రి మండల పరిధిలోని సంగాయిపల్లిలో పూలే, అంబేడ్కర్ జాతర కమిటీ వ్యవస్థాపక అధ్యక్షుడు జి.సుధాకర్ ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, ప్రజాకవి గోరటి వెంకన్న, బీజేపీ సీనియర్ నాయకుడు ఆచారి, అంతర్జాతీయ మానవ హక్కుల సంఘం కన్వీనర్ పాల్ దివాకర్ ముఖ్యఅతిథులగా హాజరై విగ్రహావిష్కరణ చేశారు. అంబేడ్కర్‌ను యువత ఆదర్శంగా తీసుకోవాలని వారు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ ఉప్పల వెంకటేశ్, ఎంపీపీ నిర్మల, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు ఎండీ ముజీబుర్ రహ్మాన్, సర్పంచ్ లలిత, జ్యోతయ్య, బీఎస్‌యూ రాష్ట్ర కార్యదర్శి కొమ్ము తిరుపతి, దళిత సంఘం రాష్ట్ర నాయకుడు రాజు, పోలీస్ డైరెక్టర్ రజిత, కల్వకుర్తి మున్సిపల్ చైర్మన్ సత్యం, అంబేడ్కర్ పూలె జిల్లా అధ్యక్షుడు శంకర్, బహుజన శ్రామిక యూనియన్ జిల్లా కార్యదర్శి రమేష్, మాజీ ఎంపీపీ లక్ష్మీదేవిర ఘురాం, రఘురాములు, మాజీ ఎంపీటీసీ యాదయ్య, సర్పంచ్‌లు ఎంపీటీసీలు, నాయకులు పాల్గొన్నారు.

# బీఆర్‌ఎస్ గెలుపునకు కృషి చేద్దాం

**శంషాబాద్ రూరల్:** ప్రతి కార్యకర్త వచ్చే ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీ గెలుపుకోసం కృషి చేయాలని ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్ అన్నారు. ఆదివారం పెద్దషాపూర్‌లోని ఓ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన బీఆర్‌ఎస్ ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలతో అన్ని వర్గాల ప్రజలకు మేలు చేకూరుతుందన్నారు. రూ.30 కోట్ల ఎమ్మెల్యే నిధులతో గ్రామాల్లో సీసీ రోడ్లు, భూగర్భ మురుగు కాలువలు, బీటీ రోడ్లు వేయించినట్లు తెలిపారు. అర్హులైన లబ్ధిదారులకు డబుల్ బెడ్‌రూం ఇళ్లను పంపిణీ చేస్తామన్నారు. సమావేశంలో ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డి, జడ్పీటీసీ తన్వీ, ఎంపీపీ జయమ్మ, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్

# దేశ భవిష్యత్ యువత చేతుల్లోనే


కార్యక్రమంలో పాల్గొన్న బీజేపీ మహిళా నాయకులు, కార్యకర్తలు

**రాజేంద్రనగర్:** దేశ భవిష్యత్తును నిర్ణయించేది యువతేనని భారతీయ జనతా పార్టీ జాతీయ మహిళా మోర్చా కార్యవర్గ సభ్యురాలు ఆకుల విజయ, అసెంబ్లీ కన్వీనర్ పొన్నమోని మల్లేష్‌యాదవ్ అన్నారు. ఆదివారం రాజేంద్రనగర్‌లోని తెలంగాణ ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషన్ ఇనిస్టిట్యూషన్ సొసైటీ ఐఐటీ స్టడీ సెంటర్‌లో రాష్ట్ర మహిళా మోర్చా ఆధ్వర్యంలో నవ యువ ఓటర్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. రాజేంద్రనగర్ డివిజన్ బీజేపీ అధ్యక్షురాలు పద్మావతి నేతృత్వంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ దేశ అభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని ప్రతి ఒక్కరూ ఓటు నమోదు చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా మహిళా మోర్చా ఉపాధ్యక్షురాలు విజయలక్ష్మి, గీతారెడ్డి, డాక్టర్ మాలతి, లక్ష్మి, కుసుమ, నాగమణి, అత్తాపూర్ డివిజన్ మహిళా మోర్చా అధ్యక్షురాలు ఉమా, మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ అధ్యక్షులు వి.లక్ష్మి, తిరుపతమ్మ, జయంతి, కవిత, స్వప్న, సీమ తదితరులు పాల్గొన్నారు.

## వ్యక్తి అదృశ్యం


చిన్న యాదయ్య (ఫైల్)

**తలకొండపల్లి:** వ్యక్తి అదృశ్యమైన సంఘటన మండలంలోని వెల్జాల్ గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ వెంకటేశ్ యాదవ్ కథనం మేరకు.. మహబూబ్‌నగర్ జిల్లా, దేవరకద్ర మండలం, డోకూరు గ్రామానికి చెందిన రామాంజమ్మ, చిన్న యాదయ్య దంపతులు. బతుకు దెరువు కోసం పిల్లలతో కలిసి తలకొండపల్లి మండలానికి వలస వచ్చారు. తల్లిదండ్రులు మండలంలోని వెల్జాల్ గ్రామంలో ఉంటున్నారు. పిల్లలు అరుణాచల డెవలపర్స్‌లో కూలి పనులు చేసున్నారు. మార్చి 18వ తేదీ ఉదయం 6.30 గంటల ప్రాంతంలో చిన్న యాదయ్య కిరాణా దుకాణానికి వెళ్లాడు. ఇంటికి రాకపోవడంతో ఆందోళలకు గురైన భార్య రామాంజమ్మ కిరాణ కొట్టులో విచారించింది. చిన్న యాదయ్య దుకాణానికి వచ్చి వెళ్లాడని దుకాణ దారుడు చెప్పాడు. దీంతో రామాంజమ్మ వెంచర్‌లో, తనకు తెలిసిన బంధువుల వద్ద విచారించింది. అయినా ఆచూకీ లభించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ ఆదివారం తెలిపారు.

## వంట విషయమై గొడవ

**గృహిణి అదృశ్యం**


ఫాతిమా (ఫైల్)

**పహాడీషరీఫ్:** భర్తతో గొడవ పడిన ఓ గృహిణి అదృశ్యమైన సంఘటన పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు... జల్‌పల్లి గ్రామానికి చెందిన షేక్ సమద్.. సానియా ఫాతిమా(22)ను రెండేళ్ల క్రితం ప్రేమ వివాహం చేసుకున్నాడు. ప్రస్తుతం సానియా నాలుగు నెలల గర్భవతి. కాగా ఈనెల 1న సాయంత్రం వంట విషయంలో ఇద్దరి మధ్య గొడవ జరిగింది. అనంతరం సమద్ నమాజ్‌కు వెళ్లగా.. ఇంటినుంచి వెళ్లిపోతున్నట్లు సానియా మెసేజ్ పంపింది. ఇంటికి వచ్చి చూడగా ఆమె కనిపించలేదు. ఈ మేరకు ఆదివారం పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్‌లో సమద్ ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఆచూకీ తెలిసినవారు 9490617241 నంబర్‌లో గానీ పీఎస్‌లో గానీ సమాచారం అందించాలని పోలీసులు కోరారు.

## బాలుడిపై వీధి కుక్కల దాడి


కుక్కల దాడిలో గాయపడిన శ్రీజిత్

**అబ్దుల్లాపూర్‌మెట్:** స్థానిక పురపాలక సంఘం పరిధిలోని 4వ వార్డులో ఆదివారం వీధి కుక్కలు ఓ బాలుడిపై దాడి చేశాయి. 4వ వార్డులో నివాసముండే బలరాం కుమారుడు శ్రీజిత్ (5)ఆదివారం ఉదయం ఇంటి ముందు ఆడుకుంటుండగా కుక్కలు దాడి చేశాయి, దీంతో అతడికి గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. వార్డులో వీధి కుక్కల బెడద ఎక్కువగా ఉందని, వెంటనే ఈ సమస్యను పరిష్కరించాలని వార్డు మాజీ కౌన్సిలర్ జీ అనుపమ కోరారు. గతంలో పలుసార్లు ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోలేదని ఆరోపించారు. వార్డులో ఇప్పటికే రెండు సార్లు కుక్కలు దాడి చేశాయని, ప్రాణాలు పోయేదాకా పట్టించుకోరా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. వీధికుక్కల కారణంగా పిల్లలను బయటికి పంపాలంటే భయమేస్తోందన్నారు.

## ప్రపంచ తెలుగు సాహితీ బ్రహ్మోత్సవాలకు శివకుమార్



**యాచారం:** మండలంలోని గడ్డమల్లయ్యగూడకు చెందిన వీ శివకుమార్ ప్రపంచ తెలుగు సాహితీ బ్రహ్మోత్సవాలకు ఎంపికయ్యారు. ఆంధ్రప్రదేశ్ కేంద్రీయ విశ్వవిద్యాలయంలో శివకుమార్ ఎంఏ తెలుగు చదువుతున్నారు. యువ కవిగా గుర్తింపు పొందిన ఆయన్ను తిరుపతిలోని మహతి ఆడిటోరియంలో ఈ నెల 9, 10 తేదీల్లో 48 గంటల పాటు నిర్విరామంగా నిర్వహించనున్న ప్రపంచ తెలుగు సాహితీ బ్రహ్మోత్సవాల్లో అవకాశం దక్కింది. శ్రీ శ్రీ కళావేదిక, ఆంద్రాణి చారిటబుల్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో శివకుమార్‌ను ఎంపిక చేశారు. సంస్థ నిర్వాహకులు పంపిన ధ్రువీకరణ పత్రాన్ని ఆదివారం శివకుమార్ అందుకున్నారు. ప్రపంచ తెలుగు సాహితీ బ్రహ్మోత్సవాల్లో పాల్గొని, సాహితీ రంగంలో తన ప్రతిభను ప్రదర్శించి ఈ బృహత్తర కార్యక్రమాన్ని విజయవంతం చేస్తానని ఆయన తెలిపారు. అదే విధంగా తెలుగు భాషా వికాసానికి తన వంతు కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు.

## క్వారీలో యువకుడి గల్లంతు

**మృతదేహం కోసం కొనసాగుతున్న గాలింపు**

**ఇబ్రహీంపట్నం రూరల్:** ఓ క్వారీలో ఈత కోసం వచ్చిన యువకుడు గల్లంతైన సంఘటన ఆదిబట్ల పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం చోటు చేసుకుంది. ఆదిబట్ల ఎస్‌ఐ లక్ష్మినారయణ కథనం ప్రకారం .. నగరంలోని ఉప్పుగూడకు చెందిన 6 మంది యువకులు ఆదివారం ఈతకొట్టడానికి కొంగరలాన్ కలెక్టరేట్ భవనం వెనకాల ఉన్న బోరబండ క్వారీలో దిగారు. ఈతకొట్టి ఐదుమంది యువకులు బయటకువచ్చారు. కానీ అందులో కిరణ్‌కుమార్(19) అనే యువకుడు గల్లంతయ్యాడు. క్వారీలో ఇరుక్కున్నట్లు స్నేహితులు చెప్పడంతో స్థానిక పోలీసులు వచ్చి గాలింపు చర్యలు చేపట్టారు. రెస్క్యూ బృందాలు, డీఆర్‌ఎఫ్ బృందాలు గాలింపు చర్యలు చేపట్టినా అచూకీ లభించలేదు. రాత్రి కావడంతో గాలింపు చర్యలు విరమించారు. సోమవారం తిరిగి గాలింపు చర్యలు చేపడతామని పోలీసులు తెలిపారు.

## ప్రత్యేక ప్రార్థనలు

**రాజేంద్రనగర్:** రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని చర్చిల్లో ఆదివారం మట్టల ఆదివారం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. రాజేంద్రనగర్ మన్నాఫుల్ గాస్పెల్ చర్చ్‌లో రెవరెండ్ సీహెచ్ జాన్ మోజెస్, సిస్టర్ సీహెచ్ ప్రభావతిల ఆధ్వర్యంలో ఈ ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా క్రైస్తవులు మట్టలు పట్టుకుని క్రీస్తు విజయోత్సవ గీతాలను ఆలపించారు.